## జనపథం - జనపదం

# చూపుడు వేలు

- నిత్యానంద్.



"చిటికెనవేలు చెల్లాయి
ఉంగరం వేలు బంగారం
మధ్య వేలు మాయన్న
చూపుడు వేలు నీకేసి
బొటకన వేలు బొట్టెట్టు"

అనే వేళ్ళ వర్ణన వినే ఉంటారు. అన్ని వేళ్ళని చక్కని పనులతో, పోలికలతో వర్ణించి, చూపుడు వేలు విషయములో 'చూపుడు వేలు నీకేసి' అనడంలో అంతర్యం ఏమిటో? ఈ వేలును చాలా సందర్భములలో ఎదుటివారిలోని లోపాలను ఎత్తి పొడవడానికి ఉపయోగిస్తామనేది సత్యం. ఎదుటివారి కన్ను పొడవడానికి కూడా చూపుడువేలినే ఉపయోగిస్తారని అనేక కథలలో విన్నాం. మొత్తానికి ఆ వేలు పేరే చూపుడు వేలు అయ్యింది. వెనుకటికి ఓ వ్యక్తి తనలోని తప్పులను గ్రహింపక, ఎదుటివారి తప్పులను ఎంచుతూ కాలం గడపసాగాడు. దేవుడు ప్రత్యక్షమై "ఏమయ్యా! ఎవరో వ్యక్తి ఎప్పుడూ ఎదుటివారిని నిందిస్తూ ఉంటాడని అన్నావు కదా! ఎవరతను?" అని అడిగాడట. వెంటనే ఆ వ్యక్తి తన సహజ ధోరణిలో తన చూపుడువేలితో పొరుగు వ్యక్తిని చూపించాడట. వెంటనే దేముడు "చూసావా! నీవు ఆతనిని చూపిస్తున్నప్పుడు ఒక వేలు మాత్రమే అతనిని, మూడు వేళ్ళు నిన్ను చూపిస్తున్నాయి. తప్పు నీలో ఉందా?" అన్నాడట. అతి తెలివితేటలు గలిగిన ఆ వ్యక్తి "స్వామీ! నాదో చిన్న సందేహం. ఎన్నివేళ్ళు చూపుతున్నాయి అన్నది కాదు కదా కావలసింది. మరి బొటన వేలు నిన్ను చూపిస్తున్నాది. అంత మాత్రము చేత నీవు దేవునివి కాకుండా పోతావా?" అని ప్రశ్నించెనట. అప్పుడు దేవుడు అతని తెలివితేటలకు ఆశ్చర్యపడి, "మీరు చేసుకొనే విన్నపాలు, మొరలు వినడానికి, అవి నాకు చేరేందుకు ఓ మార్గం కావాలి కదా! ఆ వేలిద్వారా నాకు ఆ విషయాలు తెలుస్తాయ"ని చెప్పి అంతర్ధానమయ్యాడట. దీనిమీద తర్కము వద్దు. ఇది కథమాత్రమే.

పూజా విధానములోను, తిలకధారణ సమయాలలో కూడా చూపుడు వేలు నిషిద్ధం. బొటనవేలు, ఉంగరం వేలు ఎక్కువ వాడుతాము. మధ్య వేలు కూడా వాడుతాము. కాని చూపుడువేలు వాడము. పైగా

చూపుడు వేలు విషతుల్యమని అనడం పరిపాటి. నమస్కారం చేసేటప్పుడు మాత్రం అన్ని వేళ్ళు ఉపయోగిస్తాము. బహుశా సజ్జనులను, దుర్జనులను కూడా సమదృష్టితో చూడగలిగే మహానుభావులకే కదా మనం నమస్కరిస్తాం! లేకపోతే చేతులు మోడ్చి నమస్కరించేది అరుదు. ఒంటిచేత్తో నమస్తే అని అనడం ఈనాటి వైఖరి. రెండు చేతులూ మోడ్చి నమస్కరించడం చిన్నతనంగా భావిస్తాము.

ఒక వ్యక్తి ఒక ప్రభుత్వ కార్యాలయములో పనిచేస్తున్నాడు. అతను ఉన్నత స్థితి పొందాలంటే మిగతావారి కంటే అతను బాగా పనిచేస్తున్నట్లు ఋజువు చేసుకోవాలి. అంటే అతడు బాగా కష్టపడి పనిచేస్తాడని కదా మనము ఊహిస్తాం. కాని ఈ వ్యక్తి తెలివితేటలలో ఘటికుడు. చూపుడువేలు, మధ్యవేలు చూపెట్టి - నరకకుండా చూపుడువేలిని పెద్దది చెయ్యమంటే, తడుముకోకుండా మధ్యవేలిని మూసి, చిటికెనవేలును తెరవగల వ్యక్తి. తాను బాగా పనిచేయడానికి బదులు - మిగతావారిని పోరంబోకులను చేసి, తాను ఘటికుడని నిరూపించుకోదలిచాడు. పై అధికారికి మిగిలిన వారిమీద చాడీలు చెప్పడమే పనిగా పెట్టుకున్నాడు. తన ప్రక్క ఉద్యోగి గంట గంటకి ఏదో సాకుతో బయటికి వెలతాడని, పది గంటలకి టీకొట్టు దగ్గర కనిపించాడని, పదకొండు గంటలకి పళ్ళీకొట్టు దగ్గర కనిపించాడని, పన్నెండుకి హోటల్లో కనిపించాడని పై అధికారికి చెప్పసాగాడు. అంటే ఆ ప్రక్క ఉద్యోగి ఎక్కడికి వెళ్తే అక్కడికి తాను కూడా వెళ్ళబట్టే తనకా విషయాలు తెలిసాయనే విషయాన్ని విస్మరించాడు. పై అధికారి విషయాన్ని తెలుసుకుని, వెంటనే అతనికి ఉన్నత స్థానం ఇవ్వడానికి బదులు ఉన్న స్థానం ఊడగొట్టాడు. ఎదుటివారి లోపాలను ఎత్తి చూపడంలోనే మన లోపం బయటపడుతోంది. ఇది అప్రస్తుత ప్రసంగంలాగ ఉందని అనుకోకండి. ప్రస్తుతానికి వద్దాం! ఎదుటివ్యక్తిని వేలెత్తి చూపడం చాలా సులువు. మనలోని లోపములను సరిదిద్దుకోవడం ఓ తపస్సు. దీనివలన మనకు సద్బుద్ధి, సేవాతత్పరత, ప్రేమ, ఓర్పులాంటి గుణములు అలవడుతాయి. ఏ వ్యక్తినీ దూషించకుండా ఒక్కరోజు గడపగలిగితే అతడు మహానుభావుడే. తప్పులు చేయనివాడు ఇలా తలములో అరుదు. కాని చేసిన తప్పు తెలుసుకుని, మళ్ళీ అలాంటి తప్పు చేయకుండా జాగ్రత్త పడగలిగినవాడు నిస్సంశయముగా ధన్యుడు. మహామనీషి.

ఆ కోవలోకి చేరడానికి ప్రయత్నిద్దామా!

పాత సామెత : సాధనమున పనులు సమకూరు ధరలోన.

క్రొత్త సామెత : గణన యంత్రములేనిదే గడవదు క్షణమైన US లోన.

- వాసంతి మాఘపు.